క్లుప్తంగా

గ్రంథాలయాలను వినియోగించుకోండి

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల లైబ్రేరియన్ జి.నీలమ్మ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో వేమన, సుమతీ పద్యాలు చదివించి సారాంశం వివరించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


బుడతవలసలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

లావేరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కంది నాని, బుడతవలస పంచాయతీ సర్పంచ్ రౌతు సురేంద్ర అన్నారు. శ్రీకాకుళానికి చెందిన ఉన్నతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుడతవలస సర్పంచ్ సురేంద్ర ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ బరాటం సాయితేజ, డాక్టర్ పతివాడ వివేక్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని కింతలి మిల్లు జంక్షన్ వద్ద కనకమహాలక్ష్మీ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖనం పోటీలు నేడు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పెదపాడు జాతీయ రహదారిలో కేంద్రీయ విద్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లాలోని 10 పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శంకరయ్య ఆదివారం తెలిపారు. సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రపై విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు పరాక్రమ దివస్‌గా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని స్టేట్ బోర్డు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

ద్రావణాల తయారీపై శిక్షణ


శిక్షణ ఇస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంలో ద్రావణాల తయారీ కీలకమని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు సిబ్బంది ధనలక్ష్మి అన్నారు. ముద్దాడలో ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆదివారం ద్రావనాణల తయారీపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కషాయాలు, ద్రవ, ఘన జీవామృతాలు పంటలకు మేలు చేకూరుస్తాయని చెప్పారు. రసాయన పురుగు మందులకు బదులు కషాయాలు, జీవామృతాలు వాడితే తెగుళ్ల నివారించవచ్చన్నారు. తక్కువ ఖర్చుతోనే ద్రావణాలు తయారు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అప్పల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగమంచుతో పాట్లు


లావేరు పంట పొలాల్లో దట్టంగా పడుతున్న మంచు

లావేరు: మండలంలో ఆదివారం వేకువజాము నుంచి ఉదయం 8 గంటల వరకూ దట్టమైన పొగమంచు కురిసింది. జాతీయ రహదారిపై కూడా మంచు ప్రభావం తీవ్రంగా ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. లైట్లు వేసినా పొగమంచు ఎక్కువగా పడటంతో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనిపించక వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. జీడి, మామిడి, కూరగాయాలు, మిరప, పెసర, మినుము తదితర పంటలకు మంచు నష్టం కలిగిస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదిత్యా నమోస్తుతే..!

- అరసవల్లిలో మాఘ ఆదివారం సందడి
- భారీగా తరలివచ్చిన భక్తులు


ఈఓకు విరాళ నగదు అందజేస్తున్న శంకరరావు, ఉషా దంపతులు


విరాళ చెక్కును అందజేస్తున్న తవిటిరాజు, రాజేశ్వరి దంపతులు


ఆలయ మండపాల్లో సూర్యనమస్కారాలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: మాఘమాసం తొలి ఆదివారం సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామిసన్నిధి భక్తులతో కిటకిటలాడింది. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ఆరోగ్యం కోసం సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత ప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక మాఘ మాస అలంకరణలో ఆదిత్యున్ని ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భక్తులకు సర్వదర్శనాలకు అనుమతిచ్చారు. ఒక్క రోజులో దర్శనాలు, ప్రసాదాల విక్రయాలు, విరాళాల ద్వారా రూ.4,85,720 ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. కాగా, ఆలయంలో సెల్‌ఫోన్లు వినియోగంపై నిషేధం ఉన్నా సిబ్బంది నిర్లక్ష్యంతో భక్తులు యథేచ్ఛగా లోపలికి వెళ్లి సెల్ఫీలు దిగడంపై అర్చకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతర భక్తులు కూడా వాగ్వాదాలకు దిగారు. ఆలయ అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

విరాళాల వెల్లువ

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు సమర్పించారు. స్థానికులైన వారణాసి తవిటిరాజు, రాజేశ్వరి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష చెక్కును ఈఓకు అందజేశారు. పెద్దపాడుకు చెందిన మామిడి శంకరరావు, ఉషా దంపతులు ఆలయ అభివృద్ధికి రూ.100,016 విరాళం అందించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ దాతలందరికీ రథసప్తమికి విశిష్ట దర్శనానికి ప్రత్యేక పాసులు అందజేస్తామన్నారు.

విద్యార్థులకు పోటీలు


చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: భారతీయ సంస్కృతి సంప్రదాయ కళల వారసత్వ సంపదల పరిరక్షణ సంస్థ (ఇంటాక్) శ్రీకాకుళం చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం పి.ఎన్.కాలనీలోని ఎన్‌సీఎస్ స్కూల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ వారసత్వ సంపద పరిరక్షణలో ఇంటాక్ పాత్ర కీలకమన్నారు. ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ పోటీలో పాల్గొన్న విద్యార్థుల ఎంట్రీలను న్యూఢిల్లీకి పంపుతామని, ఫలితాలు విడుదలయ్యాక తెలియజేస్తామని చెప్పారు. అదనపు కన్వీనర్ వి.జగన్నాథం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ కన్వీనర్ కె.వి.జె.రాధాప్రసాద్, కొమ్ము రమణమూర్తి, పొన్నాడ రవికుమార్, పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సేవా పురస్కారాల ప్రదానం


సేవా పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలోని కస్తూర్బా గాంధీ(కేజీబీవీ) పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రామరాజు సేవా పురస్కారాలు–2023 పలువురు ఉపాధ్యాయులకు ఆదివారం అందజేశారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ ప్రమాణాలు పాటించిన ఉపాధ్యాయులకు సేవా పురస్కారాలను అందించడం జరిగిందని సంస్థ అధ్యక్షుడు పి.రామరాజు తెలిపారు. సారవకోట ఎంఈఓ ఎం.వెంకటరమణ, లావేరు కేజీబీవీ ప్రిన్సిపాల్ బల్ల సుధా, మెట్టూరు హెచ్‌ఎం ఎం.మయూరి మణి, పి.ఎల్.పురం గ్రామానికి చెందిన స్కూల్ అసిస్టెంట్ అట్ల రవి, పోలవరం హైస్కూల్ అసిస్టెంట్ హెచ్.అనూరాధ, ఎల్.ఎన్.పేట స్కూల్ ఉపాధ్యాయుడు ఎం.కె.మిశ్రో, ఎస్.ఎస్.మనుగు ఉపాధ్యాయుడు సవర దేవుడుకి పురస్కారాలు అందించారు.

విశిష్టమైనది ఆదిత్య హృదయం


ప్రసంగిస్తున్న నారాయణమూర్తి

శ్రీకాకుళం కల్చరల్: ఆదిత్య హృదయం ఎంతో విశిష్టమైనదని, అగస్త్యమహాముని శ్రీరామచంద్రునికి ఈ స్తోత్రాన్ని బోధించారని వక్త సనపల నారాయణ మూర్తి అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో ఆదిత్య హృదయ స్తోత్రంపై ఆదివారం ప్రసంగించారు. రావణాసురుని వధించే సమయంలో ఆదిత్య హృదయ స్తోత్రాన్ని ఉపాసించి విజయం సాధించాడని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.మోహనరావు, బి.కోమలరావు, దుర్గారావు, కె.సావిత్రి, వెంకటరావు, సీత, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆనందపురం..ఆహ్లాదకరం


100 అడుగుల వెంకటసాయి మహాస్థూపం


46 అడుగుల నాగసాయి విగ్రహం

- ప్రారంభమైన 100 అడుగుల మహాస్థూపం వార్షికోత్సవాలు
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక హోమాలు

జి.సిగడాం: ప్రముఖ సాయి క్షేత్రం జి.సిగడాం మండలంలోని ఆనందపురం భక్తులకు ఆహ్లాదకర వాతావరణం అందిస్తోంది. ఇక్కడి 100 అడుగుల వెంకటసాయి మహాస్థూపం, 46 అడుగుల నాగసాయి విగ్రహాల వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 19 నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద పచ్చని పరిసరాలతో పాటు వివిధ రూపాల్లో సాయిబాబా విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే ప్రత్యేక పూజలకు సుమారు రెండు లక్షల మంది భక్తులు తరలివస్తారని అంచనా. 26న రెండుకోట్ల సాయినామ పుస్తకాలను భక్తులకు అందజేయనున్నారు.

పక్కాగా ఏర్పాట్లు..



ఈ నెల 25, 26 తేదీల్లో లక్షలాది మంది సాయి భక్తులు హాజరవుతారు. వీరికి కావాల్సిన మౌలిక సదుపాయాలను ఇప్పటికే కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆలయం ప్రాంగణంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నాం.

– మక్క వెంకటసాయి, ఆలయ నిర్మాత

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

పోలాకి: మండలంలోని బెలమర గ్రామానికి చెందిన సబ్బి లక్ష్మి అనే దళిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ విజయ్‌కుమార్ సమక్షంలో ఆదివారం దర్యాప్తు నిర్వహించారు. గొర్లె సత్యం అనే వ్యక్తి శుక్రవారం రాత్రి దాడిచేసి, ఆస్తినష్టానికి పాల్పడినట్లు సబ్బి లక్ష్మి ఫిర్యాదు చేశారు. అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో గ్రామంలో దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయిన గడ్డికుప్పను పోలీసులు పరిశీలించారు. అనంతరం డీఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ బాధిత మహిళకు రక్షణ కల్పిస్తామని, పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఐ నర్సింహమూర్తి, వీఆర్వో ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన


టాలెంట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొత్తూరు: గణతంత్ర వేడుకులను పురస్కరించుకుని మండలంలోని పారాపురం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు అదే పాఠశాలలో ఆదివారం 5వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్టుకు విశేష స్పందన లభించింది. ఓఎంఆర్ విధానంలో నిర్వహించిన టెస్ట్‌కు మండలంలోని 34 పాఠశాలలు నుంచి 126 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వంద మార్క్‌లకు నిర్వహించిన పారాపురం ఎంపీపీ పాఠశాలకు చెందిన సి.హెచ్.యశ్వంత్ 68 మార్క్‌లు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. 66 మార్క్‌లతో బి.జ్యోత్స్న (మెట్టూరు), జి.దినేష్ (గులివిందలపేట), బి.సాయిసాద్విక్ (పారాపురం) ద్వితీయ స్థానంలో నిలిచారు. హెచ్ఎం రమేష్‌బాబు, గ్రామ సర్పంచ్ కుంచాల రత్నాలు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నందకుమార్, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, పీఎంసీ చైర్మన్ కొమనాపల్లి మోహిని, వైస్ చైర్మన్ యందవ రవికుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో పేపర్లను ప్రదర్శించారు. విజేతలకు ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని నిర్వాహక ఉపాధ్యాయుడు కె.చంద్రకాంత్ తెలిపారు.

పుస్తక పఠనంపై దృష్టి సారించాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

లావేరు: విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ పుస్తక పఠనంపై దృష్టి సారించాలని మురపాక, లావేరు శాఖా గ్రంథాలయాలాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం లైబ్రరీల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజశ్యామల నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


రాజశ్యామల అమ్మవారి ఉత్సవమూర్తి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలుచోట్ల రాజశ్యామల అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బలగలోని బాల త్రిపుర కాలభైరవ పీఠం ఆలయంలో గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి పూజలు చేశారు.

గుజరాతిపేటలోని రాజరాజేశ్వరీ లలితా మహాత్రిపుర సుందరిదేవి పీఠంలో రాజశ్యామల అమ్మవారి ఉత్సవాలను పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖర శర్మ, వాశిష్ఠ కార్తికేయశర్మల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆవరాణార్చనలు, సువాశినులతో కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

‘ఉత్తరాంధ్రా పిలుపు’ పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్య చైతన్య కిరణాలు అధ్యక్షుడు డాక్టర్ బోగెల ఉమామహేశ్వరరావు ప్రాచీన, వర్ధమాన కవులకు సంబంధించి రచించిన ఉత్తరాంధ్రా పిలుపు–ప్రపంచానికి మేలు కొలుపు కవితా పోస్టర్‌ను హైదరాబాద్‌కు చెందిన సినీ గేయ రచయిత డాక్టర్ అందెశ్రీ ఆవిష్కరించారు. కాశీబుగ్గలో జరిగిన కార్యక్రమంలో ఈయన రచించిన కవితా కావ్యానికి బాల కథానిలయం ఉపాధ్యక్షుడు పాలక దేవానంద్ పాట పాడారు. అనంతరం ఉమాకవిని సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అట్టాడ అప్పలనాయుడు, పిల్లా తిరుపతిరావు పాల్గొన్నారు.

తూర్పుకాపు ఉద్యోగులు సంఘటితం కావాలి


ఐక్య నినాదాలు చేస్తున్న తూర్పుకాపు ఉద్యోగులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తూర్పుకాపు ఉద్యోగులంతా అన్ని విషయాల్లో వివక్షకు గురవుతున్నందున అందరూ సంఘటితం కావాలని తూర్పుకాపు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామజోగినాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్లో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక భవన నిర్మాణానికి ఉద్యోగుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. తూర్పుకాపులంతా ఐక్యతగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నిరుపేద తూర్పుకాపులను ఆదుకోవడమే లక్ష్యమన్నారు. సమావేశంలో తూర్పుకాపు న్యాయ సలహాదారులు వాన కృష్ణచంద్, సంఘ ప్రధానకార్యదర్శి పడాల తమ్మినాయుడు, అంకడాల తవిటన్న, అసోసియేట్ ప్రెసిడెంట్ కిల్లారి నారాయణరావు, మహిళా ప్రతినిధి సురవరపు పార్వతి, ట్రెజరర్ మక్కా శ్రీనివాసరావు, వాళ్లే శ్రీరాములునాయుడు, గొంటి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నీతి కథల్లో సారాన్ని గ్రహించాలి


నీతికథ చెబుతున్న విద్యార్థి

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు నీతికథల్లోని సారాంశాన్ని గ్రహించి వాటిని నిత్యజీవితంలో అన్వయించుకోవాలని బలగ గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేన అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లి చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులతో నీతికథలు చెప్పించారు. విజేతలుగా నిలిచిన టి.నిధి, ఎం.యశ్వంత్, కె.ఈశ్వరసాయిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు క్విజ్, పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బి.ఎం.ఎస్.పట్నాయక్, నిక్కు హరిసత్యనారాయణ, జి.చిన్నారావు, సాయిప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.



ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతం

కానిస్టేబుల్ ఉద్యోగ పరీక్షలు సజావుగా సాగాయి. శ్రీకాకుళం నగరంతో పాటు ఎచ్చెర్ల మండల పరిధిలో చిలకపాలెంలో శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఎచ్చెర్లలోని వేంకటేశ్వరా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం, కేశవరెడ్డి పాఠశాల, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ఎచ్చెర్ల ప్రభుత్వ పాఠశాల, ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికలు పాఠశాల, దుప్పలవలస అంబేద్కర్ గురుకుల పాఠశాల తదితర 11 కేంద్రాల్లో పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ పరీక్షలకు గంట ముందు అభ్యర్థులకు ప్రవేశం కల్పించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మహిళల తనిఖీలకు ప్రత్యేకంగా బూత్‌లు ఏర్పాటు చేశారు. మెటల్ డిటెక్టర్లు ఏర్పాట్లు చేశారు. పలు పరీక్ష కేంద్రాలను ఎస్పీ జి.ఆర్.రాధిక పరిశీలించారు.

– శ్రీకాకుళం క్రైమ్/ఎచ్చెర్ల క్యాంపస్


శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద ఐడీ కార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ మహేంద్ర మాతే


గీతం సెంటర్ వద్ద ఉదయం ఆరుగంటలకే అభ్యర్థుల గదుల చెకింగ్


ఉదయం ఆరుగంటలకే స్కూటీపై వచ్చి రూమ్ నెంబర్ తెలుసుకుంటున్న అభ్యర్థులు


ఉదయాన్నే క్యూలో నిల్చొన్న అభ్యర్థులు